# అప్పుడే అయిపోయిందా?

"ఒరేయ్ఁ... ఎక్కడున్నార్రా? సీరియల్ టైమైంది... అంతా రండి!"

- అంటూ టీవీ ఎదురుగా ఉన్న దివాన్ మీద కూర్చుని బామ్మగారు కేకెట్టింది.

భోజనాలకు గంట కొడితే హాస్టల్‌లో పిల్లలు కంచాలు, గ్లాసులు పుచ్చుకుని పరిగెత్తుకుని వచ్చినట్లుగా నాలుగిళ్ళ చావిడిలోంచి అరడజను మంది ఆడామగా గుంపుగా వచ్చి టీవీ ఎదురుగా కుర్చీల్లో కూర్చున్నారు.

అంతగా చెప్పుకోదగ్గ విశేషం ఏముందిట? అంటే... ఆ రోజు 'మా టీవీ'లో 'రాగాలూ- రంగులూ' అనే మేగ్నటిక్ పవర్ సీరియల్ ఏడువందల ముప్పయ్ ఒకటో భాగం ప్రసారం కానుంది.

ఇంతకాలంగా ప్రేక్షకులు- ముఖ్యంగా... మహిళామణులు వంటింట్లో పనులు, భర్తలకు సౌకర్యాలు, పిల్లల అవసరాలు మానేసి విశేషంగా చూస్తున్నందుకుగాను వారికి సీరియల్ ప్రసారంలో కొన్ని ప్రశ్నలు అడగటం జరుగుతుంది. వాటికి జవాబులు 'కాంపిటీషన్ పోస్ట్‌కార్డ్' మీద రాసి పంపాలి.

దాదాపు ఆ ఇంట్లో అందరూ... ఒక్క బామ్మగారు తప్ప- ఏదో ఒక ప్రశ్నను సమాధానాన్ని రాసి పంపినవారే! అత్యంత ఆత్రుతతో లాటరీ ఫలితాల కోసం ఎదురుచూసినట్లుగా ఎదురుచూస్తున్నారందరూ.

ఆరోజు రాత్రి ఎనిమిది గంటల నుండి తొమ్మిది గంటల వరకూ ఈ ప్రత్యేక సీరియల్ 'ప్రత్యేక ప్రోగ్రాం' ఉందని వంటలు త్వరత్వరగా పూర్తిచేసుకొని, భోజనాలు ప్రస్తుతానికి వాయిదా వేసి, ఆసక్తిగా కూర్చున్నారంతా.

ఆ ఇంటి పెద్దకోడలు- టీపాయ్ మీద బాల్‌పెన్, కాంపిటీషన్ పోస్టుకార్డుల బొత్తి పెట్టుకొని సిద్ధంగా కూర్చుంటుంది సీరియల్స్ వస్తూంటే! ప్రకటనల్లో పజిల్స్ వచ్చినా, సీరియల్స్‌లో ప్రశ్నలు వచ్చినా... వెంటనే జవాబులు రాసేయడం; అర్ధరాత్రీ, అపరాత్రీ అనేది లేకుండా వెంటనే పిల్లాడ్ని పంపించి హెడ్ పోస్టాఫీసులో పోస్టు చేయించడం; "అమ్మా... ఉదయం వరకూ ఉత్తరాలు తియ్యరే బాబూ!" అని పిల్లాడు మొత్తుకున్నా 'నా కార్డు ముందు డబ్బాలో పడాలి. వాళ్ళు ఎప్పుడు తీసేది నాకనవసరం!" అంటుంది. వాడేం చేస్తాడు? చచ్చినట్టు ఆమె చెప్పినట్టు చేయడం తప్ప!

'ఏమేవ్ఁ... ఛానెల్ మార్చు. సీరియల్ వచ్చే టైమైంది!" అన్నారు బామ్మగారు.

బామ్మగారి మనవడు తన చేతిలోని రిమోట్ నొక్కాడు.

అసలు వాడు రిమోట్ ఎప్పుడు నొక్కుతాడో, ఏ ప్రోగ్రాం పూర్తిగా చూడనిస్తాడో... ఘోరతపస్సు చేస్తే ప్రత్యక్షమైన దేవుడు సైతం చెప్పలేడు. అయితే... ఈ సీరియల్ విషయంలో వాడికీ 'కమిట్‌మెంట్' ఉంది. కాబట్టి బామ్మగారు చెప్పినట్లు విన్నాడు.

"ట్రింగ్... ట్రింగ్...

ప్రేక్షకులకు నమస్కారం! గత రెండు సంవత్సరాలుగా మా సీరియల్‌ను అదరిస్తున్నందుకు మా శుభాభినందనలు! చాలామంది ప్రేక్షకులు తమకు పుట్టిన పిల్లలకు ఈ సీరియల్‌లోని హీరో హీరోయిన్ల పేర్లు పెట్టుకున్నారని అసంఖ్యాకంగా మా కార్యాలయానికి ఉత్తరాలు వచ్చాయి. (కట్ చేస్తే- గుట్టలు గుట్టలు... ఉత్తరాల గుట్టలు!)

అంటే... ఈ సీరియల్ మీ హృదయాలలో ఎంతగా గుచ్చుకుపోయిందో మేం వేరే చెప్పనవసరం లేదు. ఇప్పుడు ఏడువందల ముప్పయ్ ఒకటో భాగం చూస్తారు. మీకు తెలుసు- పోయినవారంతో రెండు సంవత్సరాలు పూర్తయిన శుభసందర్భంలో ఈ సీరియల్‌లో పాల్గొన్న నటీనటులు, సాంకేతిక నిపుణులు, కొంతమంది ఎంపిక చేసిన ప్రేక్షకులతోనూ ఇంటర్వ్యూ ప్రసారం చేశాం. ఈరోజు నుండి మరలా సీరియల్ ప్రారంభమవుతుంది. ట్రింగ్... ట్రింగ్..."

వెంటనే ప్రఖ్యాత సినీతార జుట్టు విరబోసుకుని టీవీ తెరపై ప్రత్యక్షమైంది.

"ఈ సముద్రపు అలల లాంటి నా కేశసౌందర్య రహస్యం మీకు తెలుసా? ఆరువందల తొంభై వనమూలికలతో తయారైన 'ఢంగ్' ట ('త' అనుకునేరు... 'ట'నే!) ల నూనె వాడండి!" అంటూ ఆ తార మాయమైంది.

ఆ వెంటనే ఒక యువకుడు ప్రత్యక్షమయ్యాడు-

"ఇప్పుడు మీరు చూసిన ప్రకటనలో సితార తన జుట్టును ఏ చేత్తో సవరించుకుందో, ఎన్నిసార్లు సవరించుకుందో సరిగ్గా రాసిన వారికి సంవత్సరానికి సరిపడా 'ఢంగ్' తలనూనె పంపబడును" అని చెప్పాడు.

అంతే...

బామ్మగారి పెద్దకోడలు టీపాయ్ మీద కాంపిటీషన్ పోస్టుకార్డుల బొత్తిలోంచి ఒక కార్డు తీసి వెంటనే ప్రశ్న- జవాబు రాసేసింది.

"పిచ్చిదానిలా అన్నీ రాస్తావ్... ఒక్క ప్రైజూ రాదు. నా కొడుకు జీతమంతా ఈ కార్డులకే అయ్యేట్లుంది. నిన్న కార్డులు అయిపోయాయిగా... మళ్లీ తెప్పించావా?' అంటూ సణిగింది బామ్మగారు.

"అత్తయ్యగారూ! ఎప్పుడో పెద్ద బహుమతి రాకపోదు. అప్పుడు మీరే నన్ను పొగుడుతారు చూడండి!" అంది కోడలు.

మళ్లీ ట్రింగ్... ట్రింగ్...

ఒక వస్తాదు ప్రత్యక్షమయ్యాడు-

"నేను ఇలా ఉన్నానంటే దానికి కారణం... ఇదిగో- ఈ చిన్ని మాత్ర! దీన్ని రోజూ రాత్రిళ్ళు కుడితిలో వేసుకొని తాగండి... ఎనలేని శక్తి! పడకగదిలో మీ భార్య దగ్గర ధైర్యంగా

తల ఎత్తుకోండి!!" అంటున్నాడు. అతని భార్య– అతని వెనుక వీపు గోకుతూ... కైపుగా చూస్తూ వుంది ప్రేక్షకుల వైపు.

ట్రింగ్... ట్రింగ్... "ఇప్పుడు మేగ్నటిక్ సీరియల్ 'రాగాలూ – రంగులూ' ఏడువందల ముప్ఫయ్ ఒకటో భాగం చూడండి..."

"తాతా... నేను మీ మాట వినలేను. నన్ను క్షమించండి!" అంటోంది మనవరాలు.

"ఎందుకు?" తాతగారు చాలా కోపంగా, చాలా స్పీడుగా హాలులో అటూఇటూ తిరుగుతూ.

"నేను ఆనంద్‌ని మనసారా ప్రేమించాను..."

"ప్రేమించడమా? దానిదేముంది... ఇప్పుడు నేను చూపించిన అబ్బాయిని మళ్లీ ప్రేమించు!"

"నా బాధను అర్థంచేసుకోండి. నేను చాలా ముందుకు వెళ్లిపోయాను ప్రేమలో!"

"ముందుకు వెళ్తే వెనక్కు రామ్మా!"

"వెనక్కు రాలేను..."

"ఎందుకు రాలేవు?"

"అది అంతే! నేను చెప్పలేను... చెప్పలేను... చెప్పలేను..."

చెవులు బద్దలయ్యేట్లు శోకసంగీతం!

"బామ్మా! ఈ అమ్మాయి ఎవరనుకున్నావ్? సీరియల్ మొదట్లో పుట్టిన సుశీలే!" అంది బామ్మగారి పెద్దమ్మాయి.

"ఓరి నీ ఇల్లు బంగారంగానూ... ఎంత పెద్దదై పోయిందీ?! పైగా– తాతని ఎదిరిస్తోంది భడవా... మా కాలంలో అయితేనా?'

కన్నుమూసి తెరిచేలోగా– సీరియల్‌లో ఓ సన్నివేశం ముగిసింది.

"నమస్కారం! గత వారం మేం కొన్ని ప్రశ్నలు అడిగాం. వాటికి సరైన సమాధానాలు, విజేతల పేర్లు చెప్తాం. మొదటి ప్రశ్న– 'సుశీల మొదటిసారిగా తన ప్రియుణ్ణి కలుసుకున్నపుడు ఏమని పలకరించింది?' చాలామంది 'హలో' అని రాశారు. అది తప్పు. సుశీల అతన్ని కళ్ళతో పలకరించింది."

"అన్యాయం!! 'హలో' అని నోటితో పలకరించింది. కాని, కళ్ళతో పలకరించటం అంటుండేమిటీ?' అంటూ పెద్దకోడలు ఆక్రోశించింది.

'మరో ప్రశ్నకు జవాబు... 'సుశీల తాతగారికి సీరియల్ మొదట్లో బాగా జుట్టు ఉంది. (ఇప్పుడు బట్టతల లెండి!) అతను పాపిడి ఎటు తీసుకున్నాడు?' చాలామంది పాపిడి ఎడమవైపు తీసుకున్నాడని రాశారు. తప్పు! ఆయనది గుబురు జుట్టు... అసలు పాపిడి తీసుకోలేదు. అంతే! అందువల్ల మేం అడిగిన ప్రశ్నలకు ఎవరూ సరియైన సమాధానం రాయనందున బహుమతులు ప్రకటించలేకపోతున్నాం. క్షమించండి!"

"ఛాల్లే... ఏడిశావ్! ఎడమ పాపిడి శుభ్రంగా కనిపిస్తుంటేనూ?" అంటూ పెద్దకోడలు ఆవేశంగా అరిచింది.

ట్రింగ్... ట్రింగ్...

సుశీల తన గదిలో విచారంగా కూర్చుని ఉంది. ఎదురుగా తాతగారి ఫోటోవైపు చూసింది. తాతగారు సుశీలను ఎంత గారాబంగా పెంచారో ఫ్లాష్‌బ్యాక్!

సుశీల తన చేతిలోని తన ప్రియుడి ఫోటోని బాధగా చూసింది. తను తన ప్రియుడు పార్కుల్లోనూ, సినిమా హాళ్ళలోనూ, స్టార్ హోటల్‌లోనూ అతనికి తను ఎలా అర్పించుకుందో మళ్లీ ఫ్లాష్‌బ్యాక్!

"అమ్మా... నన్ను ఏం చేస్తావే?" అని పెద్దశబ్దం వినిపించింది.

సుశీల ఉలిక్కిపడి తన కడుపు వైపు చూసుకుంది.

"నా జీవితం వ్యర్థం. ఏం చేయను తల్లీ!" అంటూ సుశీల ఒక నిర్ణయం తీసుకున్న దానిలా లేచి గది బయటకు వచ్చింది.

కట్...

"సుశీల ఇప్పుడు ఏ నిర్ణయం తీసుకుందో ఊహించి రాయండి. వచ్చేవారం సీరియల్‌లో చూపించినట్లుగా రాసినవారికి 'కలర్ టీవీ' బహుమానం."

ట్రింగ్... ట్రింగ్...

"ప్రొద్దుట్నుంచీ ఈ సీరియల్ కోసం పడిగాపులు పడి ఎదురుచూశాం... పనులు మానేసి! ముదనష్టం... పది నిమిషాల పాటు సీరియల్ చూపించాడో, లేదో... అప్పుడే అయిపోయింది!" అని గొణుక్కుంది బామ్మగారు.

' ఆంధ్రభూమి ' దినపత్రిక ... 8 ఫిబ్రవరి' 2001 సంచికలో ప్రచురితం